సాక్షి
మహబూబాబాద్
గురువారం । 4 । మే । 2023



మహా జాతరకు ముందస్తు ఏర్పాట్లు
మేడారం మహా జాతరకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వనదేవతల పూజారులు పది నెలల ముందుగానే జాతర తేదీలు ఖరారు చేశారు. - 8లో▸



బ్రోకర్ మాటల బీజేపీ..
బీజేపీ నేతలవి బ్రోకర్ మాటలు. కాంగ్రెస్ పార్టీ నచ్చిన పార్టీ అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.2^0 /23.2^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'మన ఊరు-మన బడి' అభివృద్ధి పనుల పరిశీలన



డోర్నకల్: స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో చేపడుతున్న మన ఊరు-మన బడి అభివృద్ధి పనులను జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పరిశీలించారు. పనుల ఆలస్యానికి గల కారణాలను పాఠశాల హెచ్‌ఎం వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చర్చి కాంపౌండ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఫుట్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని డీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీరాములు, ఉపాధ్యాయులు వి.సుధాకర్, వెంకట్రావ్, వెంపటి సీతారాములు, తలారి విద్యాసాగర్, గుగులోత్ వీరన్న, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు



గూడూరు: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగొద్దని, నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని ఆర్డీఓ కొమురయ్య అన్నారు. గూడూరు, అయోధ్యపురం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతుల ఏర్పాటు, హమాలీల పనితీరు, నిబంధనలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఐకేపీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందేలా చూడాలి

డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్



నెహ్రూసెంటర్: ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ఏఎన్‌ఎంలు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్, లయన్స్‌క్లబ్ భవన్‌లో ఏఎన్‌ఎం, రెండో ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్యం అందించాలని, అవసరమైతే పీహెచ్‌సీ నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించాలని సూచించారు. ఓరల్, ఎమర్జెన్సీ ప్రథమ చికిత్స అందించేలా వైద్యులచే ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, పీహెచ్‌ఎన్ సక్కుభాయి, సూపర్‌వైజర్లు సత్రీ, రాజేశ్వరీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి ఎస్సీ ఎస్టీ సెల్ భవనం సిద్ధం



కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ సెల్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ నెల 5వ తేదీన నగర పర్యటనలో భాగంగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దీనిని ప్రారంభించనున్నారు. రూ.8.08 కోట్ల నిధులతో ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ద్వారా నూతన ఆవిష్కరణలకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు శ్రీకారం చుట్టేందుకు ఎస్సీ, ఎస్టీ సెల్ మూడేళ్ల పాటు పనిచేయనుంది. తొలి ఏడాది సైంటిఫిక్ స్టడీస్, రెండో ఏడాది సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం, కేంద్ర పరిశోధన సంస్థలతో పరస్పర అవగాహన, మూడో సంవత్సరం సైన్స్ అండ్ టెక్నాలజీ శిక్షణ కార్యక్రమాలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి తోడ్పడనుంది.

ఖాళీ జాగా.. కబ్జా

చెరువు శిఖం, బఫర్ జోన్ల ఆక్రమణ

- ఆక్రమణపై కలెక్టర్ సీరియస్
- భూములను గుర్తించి హద్దులు పెట్టాలని ఆదేశం
- మల్లగుల్లాలు పడుతున్న నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు



సాక్షి, మహబూబాబాద్: మానుకోట పట్టణ పరిధిలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టణం విస్తరిస్తుండడంతో చెరువు శిఖం, బఫర్ జోన్లను ఆక్రమిస్తున్నారు. భూకబ్జాదారులకు అధికారులు సహకరిస్తుండడంతో విలువైన ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. దీంతో విశాలమైన చెరువులు నీటి తొట్టిల్లా మారుతున్నాయి. కాగా చెరువుల కబ్జా విషయం తెలుసుకున్న కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల భూముల లెక్కలు తేల్చాలని, శిఖం భూములకు హద్దులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంతకు ముందే అక్రమణదారులకు ఎన్‌ఓసీలు ఇచ్చిన అధికారులు కలెక్టర్ ఆదేశాలతో కంగుతింటున్నారు. భూ హద్దులు ఎలా గుర్తించాలనే మీమాంసలో పడ్డారు.

కలెక్టర్ సీరియస్..

మహబూబాబాద్ పట్టణ పరిధిలో బంధం చెరువు, నిజాం చెరువు, కంబాలపల్లి చెరువు, రాంబంధు చెరువు, జనాల్ చెరువు ఉన్నాయి. ఈ చెరువుల్లో భూములను కబ్జా చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు శిఖం భూములపై కన్నేసి, అధికారులను మచ్చిక చేసుకొని ఎన్‌ఓసీలు కూడా తెచ్చుకున్నట్లు సమాచారం. ఈ విషయం గమనించిన కలెక్టర్ శశాంక ఇటీవల నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. చెరువుల ఆక్రమణ, శిఖం భూముల్లో రియల్‌ఎస్టేట్ వెంచర్లు, వాటికి అనుమతుల విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వారానికి ఒక చెరువు చొప్పున అన్ని చెరువులకు హద్దులు గుర్తించాలి. ఇందుకోసం నీటి పారుదల, రెవెన్యూ, ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆధారాలతో అక్రమణలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.

అధికారుల మల్లగుల్లాలు..

చెరువు శిఖం భూముల అక్రమణపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్రమార్కులతో చేలుతు కలిపి ముడుపులు తీసుకున్న అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే ఇటీవల చేసిన సర్వే ప్రకారం హద్దులు గుర్తించాలని భావించగా.. 1970 నాటికి ఉన్న చెరువుల విస్తీర్ణం ప్రకారం హద్దులు పెట్టాలనే మరో వాదన వస్తుంది. కాగా నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ, ల్యాండ్ సర్వే అధికారుల వద్ద ఉన్న మ్యాప్‌లు వేర్వేరుగా ఉన్నట్లు సమాచారం. ఇలా మూడు మ్యాప్‌లు ఒకే దగ్గర పెడితే ఏ శాఖ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కైంది ఇట్లే తెలిసిపోయే ప్రమాదం ఉంది. అక్రమణదారులతో కుమ్మక్కైన కొందరు అధికారులు ఒక నంబర్‌పై మరో నంబర్ భూమిని చూపించి లక్షల రూపాయలు తీసుకున్నారనే ప్రచారం జరిగింది. ఈ పరిస్థితిలో వారు నిజమైన చెరువు శిఖం భూములను గుర్తిస్తారా.. లేదా తప్పుడు నివేదిక ఇచ్చి హద్దులు గుర్తిస్తారా అనేది తేలనుంది.



బంధం చెరువుపై చర్చ..

జిల్లా కేంద్రంలోని బంధం చెరువు నీటి నిల్వ విస్తీర్ణం 47.20 హెక్టార్లు కాగా.. 11.83 హెక్టార్ల శిఖం భూమి ఉంది. అయితే ప్రస్తుతం చెరువు చుట్టూ ఆక్రమణలు, అందమైన భవనాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు.. ఇలా విశాలమైన చెరువు నీటి కుంటలా మారింది. ఈ ఆక్రమణలపై మత్స్య పారిశ్రామిక సంఘం, పలువురు పట్టణ వాసులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయితే ఈ అక్రమణలో పలువురు రాజకీయ నాయకుల అనుచరులు ఉండడం, భూములను రక్షించే అధికారులే భక్షకులకు అనుకూలంగా మారడంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోయింది. కాగా చెరువుల పరిరక్షణకు కలెక్టర్ పూనుకున్నారు. ఈమేరకు చెరువులను అక్రమార్కుల చెర నుంచి విడిపిస్తారా, లేదా అనేది జిల్లాలో చర్చగా మారింది.

ఓరుగల్లులో రేపు కేటీఆర్ పర్యటన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రి కేటీఆర్ పర్యటన వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

- రూ.181.45 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు
- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ నగరంలో శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పర్యటన ఉంటుందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. రూ.181.45 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కాజీపేటలో జరిగే బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటారని వెల్లడించారు. బుధవారం హనుమకొండ కాకతీయ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడారు. మంత్రి కేటీఆర్ 5న సాయంత్రం హెలికాప్టర్‌లో కిట్స్ కాలేజీకి చేరుకుని నగరంలో రూ.181.45కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మే మాసంలో నెల రోజుల పాటు నిర్వహించే కార్మిక ఉద్యోగ మాసోత్సవాల్లో భాగంగా ఇప్పటివరకు 6,960 మందికి లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ కార్మిక భవనం, పూలే భవనానికి శంకుస్థాపన చేస్తారన్నారు. ఆ భవనాలు పూర్తయిన తర్వాత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొన్ని పార్టీలు చిల్లర రాజకీయాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజలు, రైతులు వీటిని గమనిస్తున్నారని, రెచ్చగొట్టే వారికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల మాటలకు రైతులు గాయిగత్తర కావద్దని, సీఎం కేసీఆర్ అండగా ఉంటారన్నారు. సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఎస్.సుందరరాజు, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనపై మంత్రి ఎర్రబెల్లి సమీక్ష

వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, వొడితెల సతీశ్, కుడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ ప్రారంభించే కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. బహిరంగసభ నేపథ్యంలో మంత్రి ఎర్రబెల్లి నేతలకు దిశానిర్దేశం చేశారు.

డ్రాపద్ధతిన విద్యార్థుల ఎంపిక

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాస్థాయి కమిటీ సమక్షంలో హైదరాబాద్‌లోని రామంతపూర్, బేగంపేట పబ్లిక్ స్కూల్స్‌లో 2023–24విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం డ్రాపద్ధతిన ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సమక్షంలో డ్రాపద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విలేజ్ బస్ ఆఫీసర్



ఆర్టీసీ బస్సు



మహబూబాబాద్ ఆర్టీసీ డిపో

- ఆర్టీసీలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- ప్రయాణికులకు మెరుగైన సేవలు, ఆదాయంపై దృష్టి
- పల్లెకో బస్ ఆఫీసర్ నియామకానికి చర్యలు
- ఇప్పటి వరకు 13దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూసెంటర్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆదాయం పెంచుకోవడానికి ఆర్టీసీ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పల్లెలకు ఆర్టీసీ సేవలు మెరుగుపర్చేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టనుంది. విలేజ్ బస్ ఆఫీసర్లను నియమంచి ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. దీనిలో భాగంగా విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

పల్లెకు బస్సు..

మహబూబాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ఇప్పటి వరకు 103గ్రామాలకు బస్సు సర్వీసులు నడుస్తుండగా.. మరిన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఇప్పటి వరకు 13 దరఖాస్తులు వచ్చాయని ఆర్టీసీ డిపో మేనేజర్ జె.విజయ్ తెలిపారు. పెద్ద గ్రామాలకు ఒకరు, మూడు లేదా నాలుగు చిన్న గ్రామాలకు ఒకరు, అలాగే మున్సిపాలిటీ పరిధిలో వార్డుకు ఒకరి చొప్పున ఆఫీసర్‌ను నియమించనున్నారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారికి..

డిపో పరిధిలోని అన్ని గ్రామాల్లో విలేజ్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు స్వచ్ఛందంగా ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేసేందుకు ముందుకు వచ్చే వారికి అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. వీరు ఆయా గ్రామాలు, వార్డుల్లో ఆర్టీసీ ప్రాధాన్యతను తెలుపుతూ వివాహాలు, యాత్రలకు బస్సులను వినియోగించేలా అవగాహన కల్పించనున్నారు. కాగా విలేజ్ ఆఫీసర్లకు తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజా రవాణాను ఆదరించాలి



ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీని ప్రజలందరూ ఆదరించాలి. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకం చేపడుతున్నాం. త్వరలో కార్యక్రమం ప్రారంభం కానుంది. విహారయాత్రలు, వివాహాలు, ఇతర రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీని వినియోగించుకోవాలి.

– జె.విజయ్, ఆర్టీసీ డీఎం, మానుకోట

అంగన్‌వాడీలు.. అస్తవ్యస్తం

- పెండింగ్‌లో 8నెలల అద్దె బిల్లులు
- వేధిస్తున్న సూపర్‌వైజర్లు, సిబ్బంది కొరత
- అన్ని సెంటర్లకు సరఫరా కాని మిషన్ భగీరథ తాగునీరు

మహబూబాబాద్: జిల్లాలో అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల ఎనిమిది నెలల అద్దె బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 1,435 సెంటర్లు ఉండగా.. 463 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కాగా భవనాల యజమానులకు సమాధానం చెప్పుకోలేక అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సెంటర్లలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. విద్యుత్, తాగునీరు, ఇతర సమస్యల ఉండగా.. సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

కరెంట్ సౌకర్యం కరువు..

జిల్లాలోని 711 అంగన్‌వాడీ సెంటర్లలో విద్యుత్ సౌకర్యం లేదు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో చిన్నపిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే ప్రతీ కేంద్రానికి తప్పనిసరిగా మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని కలెక్టర్ శశాంక పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు 1,024 కేంద్రాలకు మాత్రమే కనెక్షన్ ఇచ్చారు. దీంతో చిన్నారులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది కొరత..

జిల్లాలోని 1,435 కేంద్రాలకు 58 మంది సూపర్‌వైజర్లు అవసరం. కానీ 49మంది మాత్రమే ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్లు 1,356మంది ఉండగా 81 పోస్టు ఖాళీగా ఉన్నాయి. కాగా సూపర్‌వైజర్ల కొరతతో కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఇష్టారాజ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు తెరుస్తున్నారని, నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఇలాఖాలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన జిల్లాల్లో అంగన్‌వాడీ వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే అద్దె బిల్లులు త్వరగా చెల్లించాలని టీచర్లు కోరుతున్నారు.



కనీసం బోర్డు కూడా సక్రమంగా లేని సిగ్నల్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రం

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

సెప్టెంబర్ నుంచి ఈఏడాది ఫిబ్రవరి వరకు కేంద్రాల అద్దె బిల్లులు చేశాం. త్వరలోనే అద్దెలు చెల్లిస్తాం. పర్యవేక్షణ పెంచాం. ఏమైనా సమస్యలు ఉంటే అన్ని పరిష్కరిస్తాం. టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలి.

– వరలక్ష్మి, డీడబ్ల్యూఓ

పట్టణ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలి

మహబూబాబాద్: మున్సిపాలిటీల ద్వారా పట్టణ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో బస్తీ దావాఖానాలు, హరితహారం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. పట్టణ సుందరీకరణపై నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. మోడల్ వార్డులను తయారు చేయాలని, వాటికి సంబంధించిన ఫొటోలు తీసి పంపించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్లు ప్రసన్నరాణి, కుమార్, రాజు, శ్రీనివాసరావు, డీఈ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లతాచు వర్సెస్ శునకం

కొత్తగూడ: అత్యంత విష పూరితమైన నల్లతాచుపాము వర్సెస్ పెంపుడు కుక్క. ఈ బరిలో చివరికి నల్లతాచు మట్టికరిచింది. మండలంలోని ఓటాయి గ్రామానికి చెందిన రాగం యాకయ్య బుధవారం తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నారు. అదే సమయంలో పెరడునుంచి ఇంట్లోకి వస్తున్న నల్లతాచు పామును పెంపుడు కుక్క గమనించి అరుస్తూ పోటీ పడింది. పాము, కుక్క చాలాసేపు పోరాడాయి. పాముకాటునుంచి కుక్క తప్పించుకుంటూ చివరికి కొరికి పడేసింది. ఈ రెండింటి మధ్య పోరాటాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.





నల్ల తాచుపాముతో పోటీ పడుతున్న శునకం, (ఇన్‌సెట్‌లో) చనిపోయిన పాము

రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు అంబేడ్కర్

- ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

గార్ల: భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. బుధవారం మండలంలోని రాంపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె లాంఛనంగా ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం రాంపురం గ్రామంలో పెద్దమ్మతల్లి గుడికి ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తారాబాయి, ఉపసర్పంచ్ ఎడవల్లి నవత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, వైస్‌ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, గుండా వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆదెపు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గాజుల గణేష్, ఉపేందర్, కొమ్మరాజు జగదీష్, మురళి, అజ్మీరా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

కురవి: కార్మికుల సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తట్టుపల్లి గ్రామంలో మేడే వారోత్సవాల్లో భాగంగా దొంతు రాంమూర్తి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రశ్నించే తత్వం తగ్గిపోయిందని, కమ్యూనిస్టులే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని పోరాటాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్, కొల్లూరి పెద్ద వెంకన్న,గుగులోత్ లక్‌పతి, మామిడి పరమేష్, గడ్డం మల్లయ్య, ఉపేందర్, బేతమల్ల నారాయణ, కుదురుపాక రమేష్, అంతటి యాలాద్రి, నూకల వెంకన్న, సురేష్, మురళీ పాల్గొన్నారు.

సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలి

దంతాలపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో సుఖప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి పరిధి గ్రామాల్లోని గర్భిణులకు అందుతున్న వైద్యం, పూర్తి వివరాలను పొందుపర్చాలన్నారు. ప్రతీ గర్భిణికి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. రిజిస్టర్లు పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్ స్థలం గురించి తహసీల్దార్ కార్యాలయంలో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చైతన్య, స్పందన, సీహెచ్‌ఓ బాలాజీ, సిబ్బంది చలపతి తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న మురళీధర్‌రాజ్

6న సమ్మర్‌క్యాంపు ప్రారంభం

బయ్యారం: ఈ నెల 6న బయ్యారం బాలుర ఉన్నత పాఠశాలలో 8,9 తరగతుల విద్యార్థులకు సమ్మర్ క్యాంపు ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ పూల్‌చంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల వివరాలను క్యాంపు ఇన్‌చార్జ్ లింగరాజు 9494319680 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

క్లుప్తంగా

రఘునాథపల్లి ఎస్సై వీరేందర్ ఏఆర్‌కు అటాచ్డ్



వరంగల్ క్రైం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రఘునాథపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ వీరేందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ బుధవారం ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో భూ తగదాలో గొడవ పెట్టుకుని ఇద్దరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వీరేందర్ దాడి చేసిన వర్గానికి మద్దతిచ్చి ఫిర్యాదుదారుడిపై కేసు నమోదు చేశారు. మరో అడుగు ముందుకేసి బాధితుడిపై ఏకంగా హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించాడు. ఆతర్వాత బాధితుడి భార్య పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి ఎస్‌బీ అధికారులు దిగి ఎస్సై వీరేందర్ అవినీతి చిట్టాపై సీపీకి నివేదిక అందించినట్లు సమాచారం. కాగా.. వీరేందర్ మహిళా ఫిర్యాదుదారులపై అనుచితంగా ప్రవర్తించినట్లు, అనేక భూ దందాల్లో తలదూర్చినట్లు ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీసుకున్న చర్యలపై పోలీస్‌శాఖలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

ఇంద్రయ్యకు ఘన నివాళి



భౌతికదేహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏటూరునాగారం సెకండ్ ఎస్సై బండారి ఇంద్రయ్యకు పోలీసుశాఖ బుధవారం ఘన నివాళి అర్పించింది. హనుమకొండ మండలం పలివేల్పులలో ఇంద్రయ్య భౌతికదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఎస్పీ గాష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ సెల్యూట్ చేశారు. ఇంద్రయ్య శవపేటికను ఎస్పీ, ఏఎస్పీ మోశారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి లాంఛనంగా అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ఏటూరునాగారం సీఐ రాజు, ఎస్‌బీ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ హోమ్‌గార్డులు స్వామి, ఏటూరునాగారం ఎస్సై రమేశ్, కన్నాయిగూడెం ఎస్సై సురేశ్, ఆర్ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పలివేల్పులలో విషాదం..

హసన్‌పర్తి: ఎస్సై ఇంద్రయ్య మృతితో ఆయన స్వగ్రామం పలివేల్పులలో విషాదం నెలకొంది. మత సంప్రదాయం ప్రకారం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు.



మహా జాతరకు ముందస్తు ఏర్పాట్లు

- తేదీలు ఖరారు..
- అధికారుల సమాయత్తం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు ములుగు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేపడుతోంది. ఈమేరకు వన దేవతల పూజారులు పది నెలల ముందుగానే జాతర తేదీలు ఖరారు చేశారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా జాతరలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతరపై ఇటీవల పోలీసులు అధికారులు సమీక్ష నిర్వహించారు. సాధారణ ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ముందస్తుగా జాతర అభివృద్ధి పనులకు ఆయా శాఖల వారీగా ప్రతిపాదనలు తయారు చేసి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి సమర్పించేందుకు ఉన్నతాధికారులు సమాయత్తమవుతున్నారు. గతేడాది మహా జాతరలో భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈసారి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు ముందుగానే కావాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలుస్తోంది.

పది నెలల ముందుగానే..

ప్రతి ఏటా మహా జాతర తేదీలను ఆర్నెళ్ల ముందుగా పూజారులు ప్రకటించేవారు. ఈసారి ఉన్నతాధికారుల సూచన మేరకు పది నెలల ముందుగా ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మహా జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. గత జాతరలో హడావుడి పనులతో అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలున్నాయి. ఈసారి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుస్తుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సమ్మక్క–సారలమ్మ పూజారులు కోరుతున్నారు. జాతరలో అభివృద్ధి పనులకంటే ముందుగా పూజారులకు విశ్రాంతి భవనాల నిర్మాణానికి పునాది వేయాలని పూజారుల ప్రధాన డిమాండ్ చేశారు. దేవాదాయశాఖ అధికారులు మాత్రం పూజారుల సమస్యలు పట్టించుకోవడం లేదని పూజారులు వాపోతున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా నిధులు మంజూరు చేసి జాతర ముందుగానే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పూజారులు కోరుతున్నారు.



యాటలతో ప్రదక్షిణలు చేస్తున్న పూజారులు

అమ్మవార్లకు పూజలు



సమ్మక్క–సారలమ్మ మహా జాతర తేదీలను ప్రకటించేందుకు ముందుగా పూజారులు ఆనవాయితీగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలి వాయిద్యాలతో పూజారులు యాటపోతులను పట్టుకుని వనదేవతల గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద యాటలతో ప్రత్యేక పూజలు చేశారు. యాటను అమ్మవార్లకు జడతపట్టారు. మహా జాతర విజయవంతం కావాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈసందర్భంగా పూజారులు సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులకు ప్రత్యేక పూజలు చేశారు.



విశ్రాంతి భవనాలు నిర్మించాలి



“జాతరలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ముందస్తుగా జాతర తేదీలు ఖరారు చేశాం. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జాతర సమయంలో నిర్మించిన అభివృద్ధి పనులు పది కాలల పాటు కూడా నిలవట్లేదు. మేడారంలో సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల పూజారుల కోసం విశ్రాంతి భవనాలు నిర్మించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

మిస్టరీ వీడిన మహిళ మృతి కేసు

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు నిర్ధారణ?
- నేడు వివరాలు వెల్లడించనున్న పోలీసులు

ఖమ్మం క్రైం: సంచలనం సృష్టించిన గిరిజన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు చేధించినట్లు తెలిసింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం రామన్న గుట్ట తండాకు చెందిన ఓ మహిళ (45) గత నెల 27న తన అత్తమ్మను ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించేందుకు వచ్చింది. ఆస్పత్రిలో పరీక్షలు పూర్తయ్యాక ఆటోలో వెళ్తుండగా అత్త మూత్ర విసర్జనకు కోసం ఆటో దిగగా.. సదరు మహిళను ఆటోడ్రైవర్ తీసుకెళ్లి అత్యాచారం చేయడంతో అపస్మారకస్థితికి చేరుకుందని, ఆపై ఆస్పత్రిలో వదిలేశాడని ప్రచారం జరిగింది. ఈఘటన మంగళవారం వెలుగు చూడగా.. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మహిళ బంధువులు ఆరోపించారు. దీంతో పోలీసులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. కానీ మహిళను ఆస్పత్రిలో వదిలి వెళ్లిన సమయానికి సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, ఆమె అత్తకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పోలీసులకు చిక్కులు ఎదురయ్యాయి. చివరకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

రోడ్డు దాటుతుండగా...

సదరు మహిళ తన అత్తను ఆస్పత్రిలో చూపించాక ఇద్దరూ కలిసి ప్రధాన రహదారిపైకి చేరుకున్నట్లు తెలిసింది. ఈక్రమంలో వైరా రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ వద్ద మహిళను ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొట్టడంతో ఎగిరిపడినట్లు సమాచారం. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడం, ఆమె అత్త మానసిక స్థితి బాగా లేనందున ఓ ఆటోడ్రైవర్ సదరు మహిళ వెంట ఎవరూ లేరనుకుని జనరల్ ఆస్పత్రికి వెళ్లినట్లు తెలిసింది. ఆతర్వాత ఎలాగోలా ఆమె అత్త స్వగ్రామానికి చేరుకున్నా.. వివరాలు సరిగ్గా చెప్పలేకపోవడం, ఆటోలో తీసుకెళ్లినట్లు మాత్రం చూచాయగా చెప్పడం, మూడు రోజులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబీకులు కిడ్నాప్, ఆపై అత్యాచారం జరిగినట్లు భావించినట్లు సమాచారం.

అన్ని కోణాల్లో విచారణ

గిరిజన మహిళ కిడ్నాప్, ఆపై అత్యాచారం జరిగినట్లు ప్రచారం జరగడంతో పోలీసులు కేసును చేధించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె ఫొటో ఆధారంగా జిల్లా కేంద్రంలో విచారించారు. అలాగే.. మహిళకు స్వగ్రామంలో ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? భర్తతో సఖ్యత ఎలా ఉందని ఆరా తీశారు. అదేరోజు ఆమె బంధువులు ఎవరైనా ఖమ్మం వచ్చారా? అని కూడా విచారణ చేపట్టారు. చోరీ కోణంలో విచారణ చేపట్టగా.. మహిళ ఒంటిపై అంతంత మాత్రంగానే బంగారం ఉండడంతో దొంగల పని కాదని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. చివరకు వివిధ షాపుల్లో సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా విచారించి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సదరు మహిళ మృతి చెందినట్లు తేల్చిన పోలీసులు.. గురువారం వివరాలు వెల్లడించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

6న ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6న హనుమకొండలో ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. 6న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాల ఔత్సాహికులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, దళితబంధు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఈ ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు.

తెలంగాణ సాహిత్యాన్ని మరింత పరిశోధించాలి

- రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు
- 'తెలంగాణ కథలు సామాజిక రాజకీయ దృక్పథం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగుర్ల, తదితరులు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ సాహిత్యాన్ని మరింత పరిశోధించి ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత పరిశోధకులపై ఉందని, ఉత్తమ సాహిత్య అధ్యయనం వల్ల సమాజంలో మార్పులు వస్తాయని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. దొడ్డి కొమురయ్య ఫౌండేషన్, తెలంగాణ రచయితల సంఘం, ఆరె విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ అస్నాల విమల రాసిన పరిశోధన గ్రంథం 'తెలంగాణ కథలు సామాజిక రాజకీయ దృక్పథం' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి హనుమకొండలోని కలెక్టరేట్ టీజీఓ భవన్‌లో ఫౌండేషన్ అధ్యక్షులు అస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో నాగుర్ల వెంకటేశ్వర్లు పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈసందర్భంగా రచయిత్రి అస్నాల విమల, వెంకటయ్య దంపతులను సన్మానించారు. గౌరవఅతిథిగా కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, ఆత్మీయ అతిథిగా వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, టీజీఓ నేత అన్నమనేని జగన్మోహన్‌రావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి మాటేటి నీరజ, డీకేఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, కడియం కావ్య, డాక్టర్ మాలతీ లత, బోనగిరి రాములు, బిల్లా మహేందర్, మోటె చిరంజీవి, ఆరె సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్ మాటల బీజేపీ.. సచ్చిన పార్టీ కాంగ్రెస్

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా 35వ డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, తదితరులు

కాశిబుగ్గ: బీజేపీ నేతలవి బ్రోకర్ మాటలు, కాంగ్రెస్ పార్టీ సచ్చిన పార్టీ అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అధ్యక్షతన పుప్పాలగుట్టలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, రాష్ట్ర సరోగసి బోర్డ్ మెంబర్ డాక్టర్ హరి రమాదేవి హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల్ని సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను, ఎమ్మెల్యే నరేందర్‌ను కాపాడుకోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత వరంగల్ స్వరూపం మారిపోయిందని, వరంగల్‌లో వెయ్యి కోట్లతో ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. నరేందర్ కృషితో నగరంలోనే కలెక్టర్ కార్యాలయం, బస్టాండ్ నిర్మాణం జరగబోతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను వరంగల్‌లో అందుబాటులోకి తెచ్చారని, దానిలో సుమారు 10 వేల నుంచి 25 వేల మంది తూర్పు నియోజక వర్గ ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే నరేందర్ కోరినట్లుగా గృహలక్ష్మి పథకం కింద ఎక్కువ ఇళ్లు వచ్చేలా సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఒప్పించి మంజూరు చేయిస్తానన్నారు. ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ.. 35వ డివిజన్‌లో రూ. 35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో 2,500 మందికి వివిధ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో పలువురు కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, దిడ్డి కుమారస్వామి, చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్లు కుందారపు రాజేందర్, బయ్యా స్వామి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


ఆర్థిక, అనారోగ్య కారణాలతో మేస్త్రీ ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన శాగ శ్రీనివాస్(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ భవన నిర్మాణ రంగాల కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుడప్పుడూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చిన శ్రీనివాస్ కడుపునొప్పి వస్తోందని చెప్పడంతో భార్య దేవేంద్ర స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లింది. కుటుంబీకులతో కలిసి నిద్రించాడు. కడుపునొప్పి, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్ తెల్లవారు జామున ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఉదయం భర్త విగతజీవిగా ఉండడంతో భార్య దేవేంద్ర బోరున విలపించింది. ఇరుగు పొరుగు వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

8న ఎంగేజ్‌మెంట్.. అంతలోనే ఉరేసుకున్నాడు



లెనిన్‌రెడ్డి (ఫైల్)

దుగ్గొండి: ఈనెల 8న అతడికి ఎంగేజ్‌మెంట్. అంతలోనే ఆయువకుడు జీవితంపై విరక్తి పుడుతోందని ఉరేసుకున్నాడు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గోనె లెనిన్‌రెడ్డి(30) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. లెనిన్ డిగ్రీ చదివి కరీంనగర్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 8న అతడికి ఎంగేజ్‌మెంట్ ఉంది. దీంతో లెనిన్ మంగళవారమే ఇంటికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం తన తల్లి పద్మను ఫంక్షన్ కోసం గిర్నిబావికి తీసుకెళ్లాడు. అనంతరం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. స్థానికులు తలుపులు బలవంతంగా తొలగించి చూడగా.. అప్పటికే లెనిన్ మృతి చెందాడు. మృతుడి తండ్రి 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సోదరుడు మల్లారెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. 'జీవితంపై విరక్తి కలుగుతోంది. చావాలని అనిపిస్తోంది. అమ్మను బాగా చూసుకో అన్నయ్య' అని రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్సై నవీన్‌కుమార్ మృతదేహాన్ని నర్సంపేట మార్చురీకి తరలించారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కు చెందిన పసునూరి రవి, రమా దంపతుల కుమారుడు వినయ్(18) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వినయ్ ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లిదండ్రులు కూలీ నిమిత్తం బుధవారం బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి ఉరేసుకుని కనిపించాడు. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

పట్టపగలే ఐదు ఇళ్లలో చోరీ

గూడూరు: మండలంలోని బొల్లెపల్లిలో బుధవారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గోపు వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కంది యాకూబ్‌రెడ్డి, తంగెళ్లపల్లి లలిత, చాడ నారాయణరెడ్డి కుటుంబాలు నర్సంపేటలో బంధువుల వివాహానికి వెళ్లాయి. మధ్యాహ్నం ఊళ్లోని ఓ వ్యక్తి ఓ ఇంటి తలుపులు, తాళం పగులగొట్టి ఉండడం చూసి సర్పంచ్ భర్త సురేశ్‌కు సమాచారం అందించాడు. వెంటనే సురేశ్ పోలీసులకు సమాచారం అందించాడు. బొల్లెపల్లికి చేరుకున్న సీఐ యాసిన్, ఎస్సై రాణాప్రతాప్ చోరీ జరిగిన ఐదిళ్ల పరిస్థితిని గుర్తించి క్లూస్ టీమ్‌కు సమాచారం అందించి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో గోపు వెంకట్‌రెడ్డి ఇంట్లో 2 తులాల బంగారం, రూ. 8వేలు. ఉపేందర్‌రెడ్డికి చెందిన రూ. 50వేలు, 2 తులాల బంగారం, చాడ నారాయణరెడ్డి ఇంట్లో రూ.50 వేలు, లలిత ఇంట్లో రూ.8 వేలు, కంది గోపాల్‌రెడ్డి ఇంట్లో రూ.1000 చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- విద్యుత్ భద్రతా వారోత్సవాలు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాలరావు

కాశిబుగ్గ: విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. బుధవారం గ్రేటర్‌లోని మణిదీప్ గార్డెన్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోపాల్‌రావు హాజరై మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. లైన్ క్లియర్ చేసిన తర్వాతే మరమ్మతులు చేయాలన్నారు. సిబ్బంది బాగా ప్రచారం చేసి ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డాక్టర్ గోపాల్ సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజీఎం టి.మధుసూధన్, ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, డీఈలు ఎ.ఆనంద్, ఎస్.మల్లికార్జున్, ఎస్ఏ సంజీవరావు, ఏడీలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

హన్మకొండ: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి జరిమానా విధిస్తూ.. వారిపై కేసులు నమోదు చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డీపీఈ విభాగం అధికారుల సమీక్ష జరిగింది. సీఎండీ ఎ.గోపాల్‌రావు మాట్లాడుతూ.. బిల్ స్టాప్ సర్వీసులను, ఇండస్ట్రియల్ సర్వీస్‌లను తరచూ తనిఖీ చేయాలన్నారు. కాలిన మీటర్లను మార్చాలని సూచించారు. చౌర్యాన్ని అరికట్టి కంపెనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, సీజీఎంలు కె.కిషన్, రాజు చౌహాన్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ ఉన్నారు.


పెట్రోల్ పోయించుకుందామని వెళ్లిన వృద్ధుడి మృతి



వినోద్‌రెడ్డి(ఫైల్)

వర్ధన్నపేట: పెట్రోల్ ట్యాంక్ ఫుల్ చేయించుకుందామని వెళ్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన గొర్ల వినోద్‌రెడ్డి(68) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వినోద్‌రెడ్డి దమ్మన్నపేట నుంచి వర్ధన్నపేటకు బైక్‌పై వెళ్లాడు. వాహనంలో పెట్రోల్ పోయించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా బావనికుంట తండాకు చెందిన ఆంగోతు వినోద్‌కుమార్, ఆంగోతు ప్రకాశ్ బైక్‌పై వెనుక నుంచి వేగంగా వచ్చి వినోద్‌రెడ్డి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో వినోద్‌రెడ్డి ఎగిరి పడ్డాడు. తలకు, కాలుకు తీవ్రగాయాలై తీవ్ర రక్తస్రావం అవుతుండగా వినోద్‌రెడ్డిని, ఇద్దరు క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ వినోద్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య పాపులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



హసన్‌పర్తి: కాలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

హసన్‌పర్తి: షార్ట్ సర్క్యూట్ కారణంగా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లిలో ఓ ఇల్లు బుధవారం దగ్ధమైంది. ప్రమాదంలో రూ.60 వేలు నగదుతో పాటు, సామగ్రి, నిత్యావసర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు బయ్య కుమారస్వామి ఆందోళన వ్యక్తం చేశాడు. కాగా.. ఘటనా స్థలిని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సందర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు.

సర్వాపురంలో..

నర్సంపేట రూరల్: పట్టణంలోని సర్వాపురంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. సర్వాపురానికి చెందిన కొయ్యల సతీశ్ మంగళవారం కుటుంబంతో కలిసి హనుమకొండలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం రాత్రి ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి మంటలను అదుపులోకి తెచ్చి సతీశ్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో వచ్చి చూసే సరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

శోభాయమానంగా పుష్పయాగం





భద్రకాళి తటాకంలో చక్రతీర్థోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తూ..

- భద్రకాళి ఆలయంలో ముగిసిన కల్యాణ బ్రహ్మోత్సవాలు
- ఘనంగా చూర్ణోత్సవం, ధ్వజారోహణం, చక్రతీర్థోత్సవం



అమ్మవారి చక్రానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం నిత్యాహ్నికం, చతుఃస్థానార్చన, గణపతిపూజ, చండీహవనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి మూర్తిని గజ పూలమాలలతో అలంకరించారు. ఉదయం చూర్ణోత్సవం జరిపి అనంతరం మధ్యాహ్నం పూర్ణాహుతి, బలిహరణ, ధ్వజారోహణగావించారు.

చక్రతీర్థోత్సవం..

ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు చక్రతీర్థోత్సవం (చక్రస్నానం) నిర్వహించారు. మంగళవాయిద్యాలతో, భద్రకాళి శరణంమమః అంటూ భద్రకాళి తటాకంలో చక్రతీర్థోత్సవ తంతును నిర్వహించారు. తిరిగి అమ్మవారి సన్నిధికి చేర్చారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తల్లి మెడలో తీరొక్క పూలు

రాత్రి స్నపన మందిరంలో అమ్మవారికి వేద పండితులు మంత్రోచ్ఛరణ చేస్తుండగా శతఘటాభిషేకం నిర్వహించి అనంతరం ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. పుష్పయాగం వల్ల బ్రహ్మోత్సవాల్లో తెలిసీ తెలియక జరిగిన దోషాలు నివృత్తి అవుతాయని భద్రకాళి శేషు అన్నారు. ఆలయ ఈఓ శేషుభారతి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.